## పురుషులకు ప్రత్యేకం

# చీకటిలో నువ్వూ నేను

**— ఎమ్.వి.వి. సత్యనారాయణ**



అటూ యిటూ పంట పొలాలు. మధ్యలో బస్ రూట్.

చల్లటి గాలి కిటికీలోంచి తగుల్తోంది. పంట పొలాలు నీటితో తడిసివున్నాయి. సేద్యపు నీటిలో వరిమొక్కలు నాటుతున్నారు పల్లెటూళ్ల స్త్రీలు.

'నెల్లూరు భూముల్లో నెమలీ వాలిందీ-
నెమలీ కోరికీన వెన్నూ....'

అమాయకమైన భాష 'కలవరం తెలియని వాతావరణం! ఒకే లక్ష్యం! ఒకే వృత్తి! ఎన్నో గొంతులు కలగలసి ఒకే గొంతుగా ఎన్నో నాదాలు కలసి ఒకే నాదంగా పరివర్తన చెంది పంట పొలాల మీద

గాలిలో తేలుతూ బస్ కిటకీ వర్దకు

తోసుకుంటూ వస్తోన్నాయి.

అది జీవనాదం:

పంట గింజలు ఎవరు తింటారో తెలియదు. కేవలం ఆ రోజు తిండి గింజల కోసం ఆ పల్లెటూళ్ల స్త్రీలు వంచిన నడుములు ఎత్తకుండా వరి మొక్కల్ని భూమి తల్లి ఒడిలో నాటుకుంటూ వెళ్తోన్నారు.

వాళ్ళ గొంతుల్లోంచి 'నెమలి' అన్నమాట వినబడేసరికి నాకు సావిత్రి గుర్తొచ్చింది. మగ నెమలికి మాత్రమే వేయివర్ణాల వేయి సౌందర్యాల వేన వేల కాంతులీనే పింఛముంటుంది.

సావిత్రి అచ్చగా మన నెమలే.

ఆడవాళ్లలో మగరాయుడు! అందానికీ సౌకుమార్యానికీ ఏమీ తక్కువ తిన్నది కాదు సావిత్రి! ఏం లాభం? వయసు ముప్పయ్! అవివాహిత!

నేను చదువు మధ్యలో మావూరు వెళ్తున్నానంటే అందుక్కారణాల్లో సావిత్రిని చూడాలన్న కోరికా ఒకటి; మా అమ్మ, నాన్న పల్లెటూళ్లోనే వున్నారు. నన్ను నగరంలో వుంచి చదివిస్తోన్నారు. మరో సంవత్సరంలో హౌస్ సర్జన్ పూర్తవుతుంది.

ఈ పల్లెటూళ్లో బోర్డు కట్టి 'జననీ జన్మ భూమిశ్చ' మననం చేసుకుంటాను.

సావిత్రి యిప్పుడేం చేస్తోందో-

ఆమె అంగన్ వాడీ స్కూల్ టీచర్స్ మీద సూపర్‌వైజర్‌గా పని చేస్తోంది. ఈ సమయానికి ఎక్కడ వుందో....ఏం చేస్తోందో!

ఊళ్ళూ తిరిగే ఉద్యోగమయ్యె! సావిత్రి యింకా అవివాహితగానే మిగిలపోయి వుండడానికి తన ఉద్యోగం ఆటంకం కానే కాదు! ఆమె మగ రాయుడి తనమే కారణమని నా నమ్మకం!

ఆరోజులు నాకింకా మస్తిష్కం పొరలమీద స్పష్టంగా చిత్రణ పట్టేవుంచాయి. ప్రక్క వూళ్ళో జూనియర్ కాలేజీలో మేమంతా... అంటే నళినీ, కాంతం, సరోజా, నేనూ క్లాస్‌మేట్స్‌మైతే సావిత్రి అదే జూనియర్ కాలేజ్‌లో టెంపరరీగా ఆఫీస్ పని చూచేది.

ఒక రోజున మమ్మల్ని కొంతమంది బాయ్స్ రకరకాల పేర్లు పెట్టి పిలుస్తోన్నారు.

నేను జయసుధలాగా వుంటానట!

నళిని జయప్రద అట!

కాంతం, సరోజా అదృష్టవంతులు. వాళ్ల కళలు ఏ సినిమా తారలలోనూ లేవు.

నిజం చెప్పొద్దూ...

అబ్బాయిలు నన్ను కామెంట్ చేయడం నాకు సంతోషాన్నే కలిగించింది.

A Thing of beauty is a joy for ever!

అందాన్ని ఆరాధించే హక్కు ఎవరికైనావుంటుంది. నళిని మాత్రం పైకి కోపం నటిస్తోంది కాని... లోపల మురిసిపోతూండే వుంటుందని నా నమ్మకం. నేనూ చిరుకోపం నటించి చురుకుగా అడుగువేశాను.

''అమితా!''

వెనక్కి తిరిగి చూశాను. సావిత్రి! ఆమె కళ్ళు ఎర్రటి చింత నిప్పుల్లా వున్నాయి. ముక్కుపుటాలూ పెదిమలూ అదురుతోన్నాయి. ఆమె నొసలు చిట్లించి నన్నే చూస్తోంది.

''ఎందుకు ఊరుకుంటావ్ అమితా! చెప్పుతో ఒక్కటి వాయించక!'' పులిలాగా గాండ్రించింది సావిత్రి.

నిజంగా నా పని యిప్పుడు ఇరకాటంలో పడిపోయింది.

సావిత్రి గురించి నా భయం నాకుంది. ఆమె ఎవర్నీ ఖాతరు చేయదు. ఆడదయ్యేది మగాడయ్యేదీ ఆమెకు ఒకటే! నన్ను కామెంట్ చేసిన వాడితో తగాదా తెచ్చుకోవడమా! అది కాదని సావిత్రికి బలైపోవడమా!

''..ఛీ..ఛీ...ఆడవాళ్లకి పూర్తిగా సిగ్గు లేకుండా పోయింది. లేకపోతే నువ్వు జయసుధలాగా ఉండటమేమిటి! నువ్వు అమితవే. నిన్ను జయసుధగా చూచిన వాని చూపులో వుంది లోపం...నిన్ను ఆరకంగా వర్ణించిన వాడు మగవాడై వుండడు. ఆడది, మగాడే అయివుంటే ఆడ దాన్ని యీరకంగా వర్ణిస్తూ కూర్చోడు. పనో పాటో చూచుకుంటాడు!''

తలెత్తి బాయిస్ వైపు చూశాను. వాళ్లెక్కడున్నారింకా? పరార్!

''వాళ్లెందుకింకా అక్కడుంటారు? పిరికి

వాళ్ళు! మగాళ్లను ఆ రకంగా అదిలించకపోతే దారికి రారు సుమా!'' అంది సావిత్రి- ఒక ఘటోత్కచుడి నవ్వు నవ్వి. ఈ దెబ్బకు నా క్లాస్‌మేట్స్ కూడా పారిపోయారు.

'బతుకు జీవుడా' అనుకుంటూ యింటికి పరుగెత్తాను.

''త్వరగా తయారై యూనిఫాం మార్చుకోవే!'' అంది అమ్మ.

''ఏవిటమ్మా, ఎందుకు?'' అన్నాను.

''ఆంటీ గారు కబురు పెట్టారే. వాళ్లింట్లో పెళ్లి చూపులు!''

''ఎవరికి?'' అడిగాను ఆశ్చర్యంగా.

''ఇంకెవరికి? ఆవిడకొక్కర్తే కదూ కూతురు!''

బిత్తర పోయాను. సావిత్రికి పెళ్లి చూపులా? మగవాళ్లను అదలించి దారికి తెచ్చుకోవాలని చూచే సావిత్రి తలవంచుకుని పెళ్లి చూపులకు సిద్ధపడ్తుందా?

ఏమైనా సరే సావిత్రి పెళ్లి చూపుల తతంగం చూచి తీరవలసిందే.

హుషారుగా ఆంటీగారింటికి బయల్దేరాము.

మా గ్రామమంతా కలసి ఆరు వీధులు. రెండు వీధులకవతలే ఆంటీ గారిల్లు. దారిలో నా కడుపులో దాక్కున్న హుషారైన మాట పైకి అనేశాను.

''ఊరుకోవే...ఎవరికి ఎలాంటి కష్టాలు రానున్నాయో చూడవచ్చామా- ఈ సంబంధానికైనా సావిత్రి యిప్పుడితే బాగుండును పాపం. ఈ పెళ్ళి సంబంధాల్తో ఆంటీకి రక్తపు పోటు కూడా వస్తోంది.'' అంది అమ్మ.

సావిత్రి కాస్త సర్దుబాటు చేసుకోవచ్చు కదా? పాతిక సంబంధాల వరకూ వచ్చాయి. ఒక్కడూ నచ్చలేదా? ఎందుకు నచ్చలేదూ... కావడానికి సావిత్రి కుందనపు బొమ్మే అయితే మట్టుకు - ఆ మాత్రం వెసులుబాటు యిచ్చి పెళ్లి చేసుకోవచ్చు కదా?

ఒక్క సంబంధం కూడా సావిత్రికి నచ్చలేదనుకుంటే లోపం సావిత్రిలో వుందనిపిస్తోంది. అప్పటికి చిన్నదాన్ని కాబట్టి ఈ మాట నేననలేక పోయాను. ఆంటీగారింట్లో పెళ్లి చూపుల ప్రహసనానికి హాజరయ్యాను.

ఆంటీతో కలసి పనుల్లో పడింది అమ్మ.

పెళ్లి సంబంధం చూసుకోవడానికి రావలసిన వాళ్లు రానే వచ్చారు. అబ్బాయి పొడుపుగా చామన ఛాయలో వున్నాడు. సావిత్రికి తగిన జోడి. సమావేశంలోకి సావిత్రిని ఎవరూ తీసుకు వచ్చి కూర్చోపెట్టలేదు. చకచక నడుచుకుంటూ వచ్చి కూర్చుంది.

సావిత్రి కొద్దిగానైనా సిగ్గు నటిస్తే బాగుండేది. అదికాకుండా నా వద్ద తనకో ఫలహారం ప్లేటు దాచి పెట్టినట్టు 'ఒకటి తీసుకురా' అంది.

సావిత్రికి ఫలహారం కాదు అందించవలసింది. మొట్టికాయ. ఆ యిల్లూ ఆ సమావేశం వాళ్లకి సంబంధించినవి. ఏం చేయగలను? ఫలహారం ప్లేటందించాను.

''మీ పేరు?'' అడిగింది సావిత్రి.

చెప్పొద్దూ? పెళ్లి చూపులకు వచ్చిన యువకుడు ఖంగు తినిపోయాడు. అతడి వెంటవచ్చిన వాళ్ల సంగతి సరే సరి.

''సురేష్'' అన్నాడతడు. బిక్క మొహం వేయబోయి తమాయించుకున్నట్టు బయటపడి



బాలనర్తకి

## స్నేహల్ కెడిలెక్కర్

**గత సంవత్సరం స్వరసాధన (బొంబాయి) నిర్వహించిన అఖిల భారత నృత్యపోటీలలో ద్వితీయ బహుమతి, డొంబివిల్లి లయన్స్ క్లబ్ జరిపిన నాట్యపోటీలలో ప్రథమ బహుమతి అందుకొన్న కుమారి స్నేహల్ వయస్సు పది సంవత్సరాలు. ఈమె డొంబివిల్లిలో శ్రీమతి విజయప్రసాద్ వద్ద కూచిపూడి నాట్యం ఐదు సంవత్సరాలుగా నేర్చుకుంటున్నది. మహారాష్ట్రీయురాలే అయినా తెలుగు పాటలకి స్నేహల్ చూపిన భావస్ఫూరిత అభినయం పలువురి ప్రశంసలు అందుకున్నది.**

పోయాడు జీవుడు.

''మిస్టర్ సురేష్, మీకు కట్నం కావాలా?''

జీవుడు ఈ సారి తమాయించుకోలేకపోయాడు.

బిక్కమొహం. బిక్కమొహం! మొహంలో నిలువు గుడ్లు!

''నేను వంట చేయను. మీరు చేస్తారా?''

''వంట చేయకపోతే ఎలా?''

''కట్నం యివ్వకపోతే నాలాంటి ఆడదానికి పెళ్లే కాదు. అయినా కట్నం గురించి అడిగితే మీరు నిలువు గుడ్లు వేశారు. అంటే కట్నం తీసుకోరన్నమాట! వంట మీరు చేస్తారా? నాక్కూడా ఉద్యోగముంది కదా!''

పెళ్లి సంబంధం వారు యిక ఆట్టేసేపు నిలబడలేదు. ఫలహారం ప్లేట్లు ఎలావున్నవి అలాగే వదిలిపెట్టి బయలుదేరారు.

వాకిట్లో నిలబడి అన్నాడా యువకుడు.

''మీ సావిత్రికి సత్యవంతుడనే వంట వాడు దొరక్కపోడు. గట్టిగా ప్రయత్నించండి!''

పక్కున నవ్వు వచ్చి చటుక్కున చుట్టూ చూశాను.

బస్సు పొలం గట్లు దాటి వూళ్లో ప్రవేశించింది. మా వూళ్లో రోడ్లు తారు రోడ్లయ్యాయి. మట్టి రోడ్లు తారు రోడ్లయినా సరే సావిత్రికింకా పెళ్లికాలేదు.

బస్సు దిగి ఎయిర్ బాగ్‌తో యింటివైపు అడుగులు వేశాను.

ఊళ్లో తాటాకుల యిళ్ల స్థానంలో పెంకుటిలోగిళ్లు వెలుస్తున్నాయి. లూనాలూ, మోపెడ్లూ తిరుగుతున్నాయి.

మా అమ్మ నాకోసం వీధి వాకిలి కాచుకుంది.

ఎంత మెడిసిన్ చదువుతూన్నా మా అమ్మకు నేను కూతుర్నే

''చిక్కిపోయావేమే!'' అంది అమ్మ.

నవ్వి మా అమ్మ భుజం పట్టుకుని లోపలికి నడిచాను.

''సావిత్రి నీ కోసం రెండుసార్లు వచ్చిందే.'' అంది అమ్మ.

ఆశ్చర్యపోయాను. సావిత్రికి నేనంటే చాలా అలుసు. నేను పూర్తిగా అబలనని సావిత్రి నమ్మకం. నాక్కూడా సావిత్రంటే భయం. ఏం మాట్లాడుతుందో వెనకాముందూ చూడకుండా మాట్లాడ్తుంది.

''పెళ్లి సంబంధాలు వస్తున్నాయా?''

''ఆ! వాటి సంగతే నీతో మాట్లాడాలట!''

''నాతోనా!'' ఈ సారి బిక్కమొహమూ నిలువు గుడ్లూ నావంతయ్యాయి.

ఆ సాయంకాలం ఆంటీగారింటికి వెళ్లాను.

సావిత్రి జూనియర్ కాలేజీలో పనిచేయడం మానేసింది. ప్రస్తుతం అంగన్‌వాడీ ఏరియా సూపర్‌వైజర్‌గా చేస్తోంది. ప్రతి మూడు నెలలకోసారి ఏరియా మార్పించుకుంటోంది. బయటికి వెళ్లి యింకా రాలేదట.

''ఎందుకు చెప్పమ్మా? ఆడపిల్లకీ వుద్యోగాలు. పిల్లాపాపాతో అది సుఖంగా సంసారం చేసుకుంటూంటే సంతోషించే యోగ్యత నాకు లేదా?'' అంది ఆంటీ.

ఆమె ఆరకంగా మాట్లాడుతుంటే నాకే కళ్ల

నీళ్లు గిర్రుమన్నాయి.

సావిత్రికి ఇరవైతొమ్మిది దాటాయి. సావిత్రి మనసు కాస్త పురుష శత్రుత్వం విషయంలో మెత్తబడితే తప్ప పెళ్లి కాదు.

ఆంటీని వూరడించడం నావల్ల ఏమవుతుంది?

మేము కబుర్లు చెప్పుకుంటుండగానే సావిత్రి వచ్చింది. బాగా అలసిపోయింది. మనిషి కాస్త రంగుతగ్గింది. ఒంటినేవళం ఆడపిల్లకు పెళ్లయ్యే వరకూ కాచుక్కూర్చోదు.

''ఎప్పుడొచ్చావు?'' అంది సావిత్రి ఆదరంగా.

వేడికి మైనంలాగా కరిగిపోయాను. సావిత్రి నాతో ఎన్నడూ అంత ఆదరంగా మాట్లాడలేదు. ఎప్పుడూ ఆత్మీయంగా మాట్లాడని వాళ్లు ఒకేసారి ఆత్మీయత ప్రదర్శిస్తే గుండె ఒలిచి యివ్వాలనిపిస్తుంది.

ఆమె దుస్తులు మార్చుకుని తిరిగి నాతో బయల్దేరింది.

ముని మాపువేళలో మేమిద్దరమూ పొలం గట్టు మీద కూర్చున్నాం. పంట పొలాల్లో ఆ రోజు వరినారు ఊడ్పు ముగించారు వ్యవసాయ కూలీలు. గాలికి వరినారు రెపరెపలాడ్తోంది.

''నువ్వు వుద్యోగం ఎందుకు మారావు?'' అడిగాను చటుక్కున.

కూలీల లొల్లాయి పదాలు క్రమంగా మాకు దూరమౌతున్నాయి.

''మరో ప్రశ్న వెయ్యి.'' అంది సావిత్రి.

''ఆడదానివి! వూళ్ళెందుకు తిరుగుతావు?

''మరో ప్రశ్న?''

విస్తుబోయాను. ''పెళ్లి చేసుకోవా...అసలు...నీకు ఎన్ని సంబంధాలు వచ్చాయో...ఏ ఆడపిల్లకైనా అన్ని సంబంధాలు...వస్తాయా?'' అన్నాను.

''నా మీద మీ అందరికీ అసహ్యం వేస్తోందా?''

''నాకు వెయ్యదు.''

''ఏం?''

''శవాల్ని డిసెక్ట్ చేయవలసిందాన్ని....''

''అయితే...!''

''అసహ్యం అనే మాట మర్చిపోయాను.''

సావిత్రి మొహంలో భావాలు కనిపించడం లేదు. చీకట్లు ముసురుకుంటున్నాయి. బహుశా నావైపు చూచి పళ్లు పటపటలాడించి వుండాలి.

''బభ్రువాహనుడు గుర్తున్నారా?''

''ఎవరూ...!''

సావిత్రి చెప్పింది. బభ్రువాహనుడు. ఎవరు చెప్మా! ఆ!

మన జూనియర్ కలేజీలో లెక్చరర్ కదూ?''

''హిస్టరీ చెప్పేవారు. అందుకే నీకంత తెలియదు.!''

''అవును... నేను సైన్స్ గ్రూప్ కదూ? ఇంతకు ఆయన...''

''ఏయ్ మొద్దూ...అది ఆయన ముద్దు పేరు!''

ఆగాగు...గుర్తొస్తోంది. ఆయన అసలు పేరు రవి గారు కదూ? ఆయన...ఆయన '' నాకు గుండె పట్టేసింది.

ఇప్పుడు రవి గారి ప్రసక్తిదేనికి?''

''ఆయన గురించి నువ్వేం మాట్లాడక. నేనే మాట్లాడుతాను. నువ్వు మూడు ప్రశ్నలు వేశావు. వాటికి సమాధానం- నేను రవిగారి భార్యను. ఆయనను వెతుక్కుంటున్నాను. నా సర్వస్వం ఆయనే''

## 'ఇదోరకం మోసం!'

ఈమధ్య మా ఎదురింటావిడతో, ఎవరో లారీ డ్రైవరు లారీలో మంచి నూనె హైదరాబాద్ తీసుకు వెళ్తున్నామని దారిలో లారీ యాక్సిడెంట్ అయ్యిందని, రిపేరుకు డబ్బుల్లేక చవకగా అమ్మేస్తున్నామని 18 లీటర్ల డబ్బా 350/- రూపాయలని చెప్పాడు. మా ఎదురింటావిడ బేరం చేసి చివరకు ఆ నూనె రూ. 275/-కు తీసుకుంది. డబ్బాలో ఉన్న నూనె మంచి వాసనతో తాజాగానే ఉంది. కాని డబ్బాలో పావుకిలో మాత్రం పైన మంచి నూనె తెట్టు కట్టింది. అడుగున అంతా నీరు. నీటిపై మంచి నూనె తేలుతుంది. దీన్ని అవకాశంగా తీసుకుని మా ఎదురింటామెను మోసం చేశారు. తోటి మహిళలు ఇలా మోసానికి గురికాకుండా ఉంటారని ఆశిస్తాను.

కడలి పార్వతీదేవి,
రాజమండ్రి

భూమి మధ్యకు విచ్చుకున్నప్పుడూ, ఆకాశం విరిగి నెత్తిమీదకి ఒరిగిపోయినపుడూ ఇళయరాజా డ్రమ్స్ కొట్టే భీభత్సపు రీ-రికార్డింగ్ గుర్తొచ్చింది నాకు. గాలిలో కొట్టుకుపోయే దాన్ని కాస్తా సావిత్రి భుజాలు పట్టుకోబట్టి ఆగాను.

ఇక్కడికి బయల్దేరే ముందు రవిగార్ని ఆస్పత్రిలో చూశాను. నా మనసు యీ పల్లెటూరి ముగ్ధత్వంతో సేదదీరవలసిన అగత్యం ఆ 'బభ్రువాహనుడే' కల్పించారు.

ఆయనకోసమా వెతుక్కుంటోంది సావిత్రి? అయితే జీవితాంతమూ తన సర్వస్వాన్నీ తల్చుకుంటూ కాలక్షేపం చేయవలసిందే. లేకపోతే గంతకు తగ్గ బొంతను వెతుక్కుని పెళ్లిచేసుకోవలసిందే.

"ఆయన డిగ్రీ కళేజీలో ఉద్యోగం దొరికి బయల్దేరారు.

ఆయన జూనియర్ కళేజ్ లో వుండగా జనం నన్ను అవమానించే వారు కాదు. మా యిద్దరి ప్రణయం పసిగట్టి యిప్పుడు ఆటపట్టిస్తున్నారు. అసలు ఆయన మీద మనసు వుండబట్టే నేను పాతిక వరకూ మంచి మంచి సంబంధాలు దూరం చేసుకున్నాను.''

''రవి గారితో ఫిక్సయ్యావు కదా, ఎందుకు ఆలస్యం చేసుకున్నావు? ఈ పాటికి అయిదేళ్ల సంసార జీవితం అనుభవించి వుండేదానివి!''

''నాకాయన మీద మోజు. ఆయనకి డిగ్రీ కాలేజీ మీద మోజు.''

నిట్టూర్చాను. ఒక్కొక్క మోజు ఒక్కొక్కరికీ ప్రాణాంతకమవుతుంది కాబోలు. లేకపోతే సావిత్రికి నెలల తరబడి ఈ నిరీక్షణేమిటి? డిగ్రీ కాలేజీలో లెక్చరర్ గా జాయినయ్యారుకదా రవిగారు? చేరాకకూడా యింత ఆలస్యమేమిటి? వారం క్రితం మా ఆస్పత్రికి రావడమేమిటి?

''కుటుంబ సమస్యలు! చక్కదిద్దుకుని యీ పాటికి నాకోసం బయల్దేరివుంటారు. వూళ్లు తిరుగుతూ ఆయన కోసం వెతుక్కుంటున్నాను.''

''ఎక్కడ ఉద్యోగంలో చేరారో కూడా తెలియదా? అదేమిటి?''

''నా దగ్గర ఆయన సస్పెన్స్ మెయిన్టెయిన్ చేస్తారు తెల్సా? అంతెందుకు? నేను నిరీక్షించకుండా ఎవరినైనా పెళ్లి చేసుకున్నానుకో- ఆయన దెయ్యమై పీడిస్తారట!''

''నీకా భయం వద్దు. దెయ్యాలు వట్టి ట్రాష్. కొంతమంది స్వార్థపరుల కుట్ర!''

''ఆయన నమ్ముతారు.''

"దెయ్యాలే వుంటే మార్చ్యురీకి వెళ్లినప్పుడూ శవపంచాయితీ జరిపినప్పుడూ చాలా దెయ్యాలు మమ్మల్ని పట్టుకోవాలి.''

''నాన్సెన్స్! ఏమిటా మాటలు? ఆయన నిజంగానే దెయ్యమైనట్టు-'' లేచింది సావిత్రి.

నాకు గొంతు చివరిదాకా ఆమె సస్పెన్స్ ప్రియుడి సంగతి చెప్పాలని వచ్చింది, ఎలా చెప్పగలను?

''ఆయన లేకపోతే నేను లేను..తెల్సా?'' అంది సావిత్రి.

"అయ్యో సావిత్రీ! వారం రోజుల క్రితం నేనే నీ తియ్యటి నిరీక్షణను డిసెక్ట్ చేశాను. ఈ పాడు చేతుల్తో...!''

ఉద్విగ్నంగా సావిత్రిని ఆ చీకట్లో కావిలించుకున్నాను. □